అపార్థం

'పల్లపోతు'

—(౧)—

సరిగ్గా ఇలాంటి వర్షకాలపు చీకటి రోజులు. అంతవరకు గడిపిన ఏకాంత జీవితం దుర్భరంగా కన్పించింది. దీర్ఘకాలం నుండి జరుగుతున్న ఆలోచనలు ఆ రోజు ఒక నిర్ణయాన్ని చేకూర్చినవి. ఒంటరి జీవితముతో విసుగెత్తి, చీకాకైన హృదయంతో అతని గదికి బయలుదేరాను. వీధులు నిశ్శబ్దంగా నిద్రపోతున్నవి. ఆ నిశీధపు వేళలో ప్రకృతిమాతకు ఆభరణముల వలె కన్పించే మునిసిపల్ విద్యుత్ దీపాలు తమ శక్తికొలది చీకటిని తరిమి కొడుతున్నవి. వర్షం కొద్దిగా తగ్గింది; తుంపర్లు పడుతున్నవి. జన సంచార శూన్యమైన ఆ వీధిలో నాకు ఆహ్వానాలు తెలుపుచున్నట్లుగా ఒక గది తలుపులు తెరచివున్నవి. నిస్సంకోచముగా ఆ గదిలోకి వెళ్ళాను. అచ్చటి వాతావరణం నా ఊహకు భిన్నంగావుండి, నా కమితాశ్చర్యాన్నే గాక, అంతులేని విచారాన్ని కూడా కల్గించింది. రమేష్ పడక కుర్చీలో పండుకుని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. గుండెతరుక్కుపోయే ఆవేదన యేదో అనుభవిస్తున్నాడని పీక్కుపోయిన మొఖం, చింతనిప్పులాంటి కళ్లు చెప్తున్నవి. మాసిన గడ్డం, మురికి కారే దునులు, సంస్కారంలేని జుట్టు...అతని వికృతాకారాన్ని చూడలేక కళ్లు మూసుకున్నాను. నా ప్రయత్నం లేకుండానే అతని కాలివ్రేళ్ళపై బడిన నా కన్నీటి బిందువులు అతని ఆలోచనా తరంగిణికి ఆనకట్టయినవి.

"ప్రమీ! ఏమిటి అర్ధరాత్రిలో ఇలా వచ్చావు?" అన్నాడు ఆత్రంగా-అందులో ఆశ్చర్యం అంతకుమించిన ఆనందం లేకపోలేదు. నేనేమీ మాట్లాడలేదు. నిశ్చలంగా అతని చూపుల్లో చూపులు గల్పి మౌనంగా నిలబడ్డాను.

"నన్ను క్షమించు ప్రమీ! చదువుకున్నప్పటికీ సభ్యతకు స్వస్తి జెప్పి, నా రాక్షసత్వంతో నీసునిశిత హృదయాన్ని గాయపరిచాను. నన్ను క్షమించు!" అంటూ నా చేతులు పట్టుకున్నాడు: ఆఖరి మాటలు పలికేటప్పుడు అతని గొంతు బొంగురుపోయింది. పొంగివచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ అతని చేతులతో నా మొఖాన్ని కప్పుకున్నాను.

"నువ్వు ప్రిన్సిపాల్‌కు రిపోర్టు చేసివుంటే బాగుండేది?" అని అన్నాడు.

"ఎందుకు" అని అడిగాను అర్థంగాక;

"ఈ నీచుడు మీకు దూరమయ్యే వాడు."

"నీచుణ్ని దూరం చేసుకోవాలనిగాదు నా వుద్దేశ్యం! అతని నీచత్వాన్ని దూరం చేయాలనే నా ఆశయం."

"ప్రమీ! నిజంగా నీవు వివేకివి. అజ్ఞానిగా వున్నవానికి జ్ఞానబోధ చేశావు. పస లేని జీవితానికి ఒసపోసేవు."

"అది నా విధి."

"నీ భావి జీవితాన్ని ఆలోచింపక, నీపై నిందలు మోపి, పదిమందిలో నిన్ను పరాభవించి, అన్నివిధాల నీ గౌరవమర్యాదలకు హాని గల్గించిన ఈ రాక్షసునిపై నీకెందుకింత దయ?"

"దయగాదు...!" తర్వాత మాటలు పెగిలిరాలేదు. సిగ్గుతో మొఖాన్ని దాచుకున్నాను. మొరటుగా నా నడుమును యేదో చుట్టుకున్నది. గాఢంగా అతని గుండెల్లోకి చొచ్చుకుపొయ్యాను.

"ఆ రాత్రి అతనితో గడిపాను. అలా ఎన్ని రాత్రిళ్ళు మాకు తెలియకుండా గడచిపోయాయో సరిగ్గా గుర్తులేదు. నా సాహసానికి, గుండె నిబ్బరానికి అతను పూర్తిగా పరివర్తన మొందాడు: వెనుకటి అలవాట్లన్నీ మానుకున్నాడు. రోజూ క్లాసులకు హాజరవుతున్నాడు. ఎవ్వరితోనూ మాట్లాడటములేదు. చాలా బెట్టు సరిగా వుంటున్నాడు. ఆడపిల్లలను అల్లరి చేయటము లేదు. ఎవరైనా పలుకరిస్తే ముక్తసరిగా జవాబిస్తున్నాడు. సాయంత్రం వేళలో వూరికి దూరంగా యేదో కబుర్లు చెప్పుకుంటూ కూర్చునే వాళ్లము!...నా ఆదరణ అతని అయిన వాళ్లను మరిపిస్తున్నదనీ, తాను దైవంనుండి యేదైనా కోరేదివుంటే అది నేను తనకు ఎల్లప్పుడూ దగ్గరగా వుండటమేననీ, నా కళ్లల్లో యేవో తాను చెప్పలేని కాంతులున్నవనీ, వాటి వెలుగులో తన బాధలన్నీ మరచిపోతున్నానని ఎప్పుడూ అంటుండేవాడు. అతని అనురాగానికి కృతజ్ఞతగా నా ప్రాణాలతో అతని పాదాలు కడగాలనిపించేది...కాని, మానవక్షేమం కోసం నిర్మించబడిన సంఘం మా నాశనాలకు కారణమయింది. మా పవిత్రతను అన్యోన్యతను సహించలేక కుళ్లుబుద్ధితో అసూయతో తన కడుపుబ్బరతను వెళ్లగక్కింది. మమ్మల్నిచూసి వికటంగా నవ్వింది. ఆ నవ్వుల్లోని శూలాలు మా హృదయాల్లో నాటుకపొయ్యాయి. నా సాంగత్య దోషం వల్ల అతను సమాజంలో కానివాడయ్యాడు. కన్న తలిదండ్రులకు, ఇతర రక్తబంధువులకు, అన్నిటికంటే ముఖ్యంగా ప్రస్తుతం కన్పిస్తున్న డబ్బు, తదితర ఆస్థిపాస్థులకు అతను నాగురించి దూరంగావటం నా కిష్టంలేదు; అన్నిటిని త్యాగంచేసి నన్ను

వర్ణాంతర వివాహం చేసుకుంటానని చెప్పాడు. వద్దని వారించాను. నాకోసం తన భావిజీవితాన్ని పాడుచేసుకోవద్దని బ్రతిమిలాడాను. లోకం దృష్టిలో చెడుగా పరిగణించబడి, కన్నవారి హృదయాల్లో కోతబెట్టవద్దని మొరపెట్టుకున్నాను. ప్రకృతికి విరుద్ధంగా ప్రవర్తించి నలుగురి నోళ్ళల్లో నీచంగా నానవద్దని బోధించాను. ఆచారాలకు వ్యతిరేకముగా సంచరించి కుల, వంశ గౌరవాలను భగ్నపరచవద్దని ప్రార్థించాను. కానీ, అతని పవిత్రహృదయంలో అంతకుముందే ఇముడ్చుకుపోయిన ఆదర్శవంతమైన ఒక శక్తి నా ప్రార్థనలను చెడచెవిన బెట్టించాయి. ప్రస్తుత సమాజంలో మానవుడు వేటిఆధారంతోహాయిగా ఆనందంగా,జీవితాన్ని గడపగల్గుతున్నాడో వాటిని నా కోసం అతను త్యాగంచేయటం ఇష్టంలేక నిచ్చింతతో, నిశ్శబ్దంగా నిద్రపోయే అతని పాదాలవద్ద మోకరిల్లి, నిశ్చల మనస్సుతో, నిర్మల భక్తితో అతని భావి జీవితాన్ని కాపాడమని దైవానికి నమస్కరించి ఆఖరు సారిగా ఒక లేఖ వ్రాసి వచ్చాను...అంతే!...''అన్నది ప్రమీల.

"అయితే ఆయన ఎక్కడున్నాడమ్మా!'' అన్నది నర్సు!

''ఏమో! ఎక్కడున్నాడో! ... ఏమయ్యాడో మళ్ళా నాకు కన్పించలేదు. కన్పిస్తాడనే ఆశ నన్నీ ప్రపంచంలో నిలిపింది'' అన్నది లేడిడాక్టర్ ప్రమీల.

''ఇక్కడకు రాడా ?'' అమాయకంగా ప్రశ్నించింది ఆమె మరల :

''వస్తాడు. వస్తాడనే అయినవాళ్ళంతా అంతరించినా, ఆయనకోసం అహో రాత్రిళ్లూ ... ;'' తర్వాత ఏమీమాట్లాడ లేదు.

నర్సు వెళ్లిపోయింది. ఆకాశం చిల్లులు పడినట్లుగా వర్షం జోరుగా కురుస్తుంది. అప్పుడప్పుడు కళ్లు జిగేలనే మెఱవుల కాంతులు కిటికి అద్దాలనుండి గదిలోకి చొరబడుచున్నవి. అప్పుడే పెద్దగా గర్జించిన ఉరుముల ధ్వనులు, దూరాన పిడుగు పడిన శబ్దం లేడీడాక్టర్ ప్రమీల ఆలోచనలకు ఆటంకమయ్యాయి. ఎవరో పరుగెత్తుతు తన గదివైపు వస్తున్న శబ్దం విన్పించింది : టార్చిలైటుకొఱకు సొరుగు వద్దకు వెళ్లింది. ఒక్కసారిగా తలుపులు తెరచుకొన్నవి; చలిగాలితో నెట్టబడిన ఒక వ్యక్తి లోపలకువచ్చాడు. బట్టలన్ని పూర్తిగా తడిసిపోయాయి. శరీరమంతా చలిచేత గాబోలు వణుకుతుంది.

''ఎవరునువ్వు?'' గర్జించింది ప్రమీల.

''అనాదుణ్ణి''

''ఇక్కడ కెందుకొచ్చావు?''

''ఆశ్రయంకోసం''

''ఇది శరణాలయంగాదు, పోః బయటకు!''

"అమ్మా! ప్రమాద పరిస్థితుల్లో వున్నాను. కనికరించండి" అంటూ అతను తలెత్తి ఆమెను చూసేడు. ప్రమీల చేతులోని టార్చి క్రిందబడింది. ఇద్దరూ శిలాప్రతిమలవలె అచంచలంగా నిలువబడినారు. కాసేపు నిశ్శబ్దం!

"రమేష్! ... నువ్వా!"

"అవును ... నేనే!"

"కులాసాయేనా?"

"బ్రతికే వున్నాను."

"పెళ్ళిచేసుకోలేదా?"

"-లేదు"

"ఎందుకని"

"అవసరంలేదు"

"ఎందుకీవైరాగ్యం"

"కాదు. సోమరితనం! ... పేదవాణ్ణి ప్రేమించి, ఆదరించేవాళ్లు అరుదు."

"నేను నిన్ను ప్రేమించాను."

"ఒకప్పుడు నిజమే!"

"ఇప్పుడుగూడా ప్రేమిస్తున్నాను."

"నన్ను హేళనచేయటం భావ్యం గాదు."

"నన్ను అపార్థం చేసుకున్నావు!"

"కాదు. బాగా అర్థంచేసుకున్నాను. నేను వెనుకటి ధనవంతుల గారాబ పుత్రుణ్ణిగాదు. విలాసాలకు, వినోదాలకు చిల్లపెంకులవలె వెదజల్లటానికి ప్రస్తుతం నాదగ్గర డబ్బులేదు. కనీసం నా పొట్ట నేను పోషించుకోలేని స్థితిలో వున్నాను. ఆలాంటివాణ్ణి ప్రేమిస్తున్నాననటం హాస్యం గాదా?"

"నాకులేని దురుద్దేశాలు అంటగట్టవద్దు."

"సదుద్దేశాలు కల్పించుకోవద్దు."

"నిన్నొక మనిషిగా చేయాలనే నా ఆశయం!"

"పాపభీతిలేని ప్రపంచంలో మనిషిగా జీవించటం కష్టం!"

"అర్థంలేని ఆవేశంలో భవిష్యత్తును మరుస్తున్నావు!"

"ఆనందంలో, వెర్రివ్యామోహంలో భవిష్యత్తును నాశనంచేసుకున్నాను. మోసాలకు నా జీవితాన్ని బలిచేశాను."

"ఆవేశంలో అన్నవాటికి ఆలోచించి బాధ పడాల్సివస్తుంది."

"ఆఁ ఆలోచనేవుంటే బాగుపడే వాడినే!"

"ఇప్పటికైనా మించిపోయినదేమీ లేదు. నీ అభివృద్ధికి నాసహకారం అన్ని వేళల లభిస్తుంది."

"ఎందుకీ వృధా ప్రయాస?"

"నా పవిత్ర ప్రేమను వెల్లడించుకుంటాను."

"పవిత్రప్రేమ! ... హుం పచ్చిపశు కామానికి పవిత్రప్రేమని పేరుపెట్టి ఆశలను అనురాగంద్వారా తీర్చుకోటానికి నేను వెనుకటి రమేష్‌నుగాదు. పరిస్థితులకు బానిసనయిన పచ్చిఖూనీకోరును!" ఆమె యేదో మాట్లాడబోయింది. అప్పటికే గదిలో ప్రవేశించిన పోలీసులను చూసి ఆగిపోయింది. "పట్టుకోండి పారిపోతాడు" అన్నాడు ఇనస్పెక్టర్!

"లేదు. చచ్చిసాధించేది లేకపోయినా బ్రతికి ఉద్ధరించేది లేదు. సంతోషంగా వస్తాను పదండి"

అతను ముందుకు నడిచాడు. పోలీసులు వెంబడించారు. "రమేష్" అన్న ప్రమీల పిలుపు గాలిలో లీనమైంది!

—(౦)—

హృదయగానం

శ్రీ చల్లా లక్ష్మీనరసింహశాస్త్రి

—X—

ఈ సువిశాల ప్రశాంత గంభీర పయోనిధిలో - ఈ మలయమరంద మాధురీపవన వీచికలలో
ప్రణయ సుధాతరంగిణీ ప్రవాహములలో - వలపు తళుకుల కాంతుల వెన్నెలలో

నీరజాక్షి సమాగమ నేత్రద్వయంబులో - భారభాసుర భావబంధనమ్ములలో
కలువకాంతుని మరపించు కౌగిలింతలలో - కలికివలపుల పలుకుల తేనియలలో

జలజ బాంధవ తేజ జన్మరూపంబులో - నిలయనిర్నిద్ర భావబంధురమ్ములలో
విమలమనోరాజ్య హృదయదుందుభులలో - భ్రమరసమాకీర్ణ పద్మజాతంబులో

మధురమంజుల మోహన ప్రణయరాజ్యమ్ములో - మదనసామ్రాజ్య కళాసృష్టి ఖండంబులో
ఉదయబాలారుణారుణ కవోష్ణరేఖలలో - హృదయ సుందరీ కరస్పర్శానంద కౌగిలింతలలో

నిరంతరానందదాయినీ ముఖావనాలోక నోల్లాసంబులో
భావతరానంద సుధాపరిపూర సుగంధ సమ్మోహి నీ భార స్తన ద్వయమ్ములో

చిరుతరహావభావ విలసన్ముఖామృత బింబాధరమ్ములో
మరపించి మురిపించి పులకింపజేయు గంధర్వ గానామృతోద్భవ నగళంబులో

నవనవోన్మేష యువతీ సమాగమకాంక్షా నిమగ్న హృదయాంబుజాతంబులో
కలిసి మెలిసి గాలిలో లీనమై ఆకాశమార్గాన సంచరింతు!